విజయసాయిరెడ్డిని సన్మానించిన చింతలచెరువు

విశాలాంధ్ర-కనిగిరి : ఒంగోలులో నిర్వహిస్తున్న నియోజకవర్గాల సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఒంగోలు వైయస్సార్సీపి రీజనల్ కోఆర్డినేటర్ ఎంపీ విజయసాయిరెడ్డిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి కలిసి ఘనంగా సన్మానించారు. కనిగిరి నియోజక వర్గంలో పార్టీ సంస్థాగత పరిస్థితులు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. వైసీపి నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని చింతలచెరువు కోరారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

క్రీడలు శారీరక, మానసికాభివృద్ధికి దోహదం

విశాలాంధ్ర-బేస్తవారిపేట : క్రీడలు శారీరక, మానసికాభివృద్ధికి దోహదపడతాయని ఎంఈఓ - 2 సీవీ రమణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ స్పోర్టివ్ గా తీసుకొని క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- విజయసాయిరెడ్డి సమక్షంలోనే అరుపులు, కేకలు
- మార్కాపురం ఎమ్మెల్యే అనుచరులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విజయసాయిరెడ్డి
- మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలపై వ్యతిరేక సానుకూల నినాదాలు
- ముగిసిన నియోజకవర్గాల సమీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి తెగలు ఆ అధికార వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి సమక్షంలోనే మరోసారి బయటపడ్డాయి. గత రెండు రోజుల నుంచి జిల్లాలోని నియోజ కవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్న విజయసాయిరెడ్డి మంగళవారం మార్కాపురం, గిద్దలూరు, ఒంగోలు నియోజక వర్గాల నేతలతో సమీక్షలు నిర్వహించారు. మార్కాపురం నియోజకవర్గం సమీక్ష సమావేశానికి ఆ నియోజకవర్గానికి చెందిన పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి కూడా హాజరయ్యారు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డిని బయటకు పంపించాలని ఎమ్మెల్యే అనుచరులు నినాదాలు చేశారు. వెంటనే పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి అనుచరులు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి భూ కబ్జాదారుడని పార్టీని, ఎమ్మెల్యే పదవిని అడ్డంపెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించాడంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇరువర్గాల మధ్య విజయసాయిరెడ్డి సమక్షంలోనే ఆరోపణలు చేసుకున్నారు. ఒక దశలో ఒకరినొకరు తోసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే స్పందించిన విజయసాయిరెడ్డి పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డిని సమర్థిస్తూ మాట్లాడారు. దీంతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో వచ్చిన అనుచరులు కూడా ఇదేమిటని విజయసాయిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. దీంతో మార్కాపురం నియోజకవర్గ సమీక్ష సమావేశం అసంతృప్తిగా ముగిసింది. ఆ వెంటనే గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించిన విజయసాయిరెడ్డి ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై ఒక వర్గం వ్యతిరేకంగా మరోవర్గం సానుకూలంగా వాగ్వివాదం చేసుకున్నారు. కొంతమందికే మాట్లాడే అవకాశం ఇస్తున్నారని, మరికొందరు ఇవ్వకపోవడంపై విజయసాయిరెడ్డిపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గిద్దలూరు నియోజకవర్గం నుంచి హాజరైన రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట, కంభం మండలాలకు చెందిన నేతలు ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. విజయసాయిరెడ్డి జోక్యం చేసుకొని అందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తాం. సమస్యలు ఉంటే సరిచేసుకుందాం. మనం ఒకరిపై ఒకరు దూషించుకుంటే పార్టీ పరువు పోతుంది. వచ్చే ఎన్నికల్లో కలిసిమెలిసి పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు పెట్టుకుంటే పార్టీకి నష్టం జరుగుతుంది. అలాంటివారిని క్షమించేది లేదు. వారు ఏ స్థాయిలో ఉన్నా పార్టీ నుంచి బయటకు పంపిస్తామంటూ ఒక దశలో విజయసాయిరెడ్డి హెచ్చరించారు. అంతకుముందు రోజు ఒంగోలు, కొండేపి, కనిగిరి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ముఖ్య నేతలతో విజయసాయిరెడ్డి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సంతనూతలపాడు, కొండేపి, దర్శి, కనిగిరి నియోజకవర్గాలలోని నేతలతో సఖ్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ఇవన్నీ విజయసాయిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఒక దశలో విజయసాయిరెడ్డి కూడా ఏంటి ఈ గొడవలు అంటూ అసహనం వ్యక్తం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కొన్ని విషయాలతో జోక్యం చేసుకుని కొందరితో మాట్లాడితే కొన్ని సమస్యలు సర్దుమనుగుతాయని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో పాటు మంత్రి ఆదిమూలపు సురేష్‌లు తదితరులు విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది.

చంద్రబాబుపై ఇంకా చాలా కేసులు ఉన్నాయి అన్ని బయటకు వస్తాయి
- విజయసాయిరెడ్డి

మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పక్కా అవినీతి పరుడని ఆయన వల్లే రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టాయని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు, ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గత రెండు రోజులు ఒంగోలులో ఉంటూ నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు ముగించుకొని ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా చేసిన ప్రతి పని ఒక స్కాం అని అన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసే కాకుండా ఇంకా అనేక కేసుల్లో చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని అన్ని కేసులు ఒకటి తరువాత ఒకటి బయటకు వస్తాయని పేర్కొన్నారు. 370 కోట్ల ప్రజా ధనాన్ని దోచుకొని సిమెంట్స్ కంపెనీకి ఒక్క రూపాయి కూడా కట్టలేదని అన్నారు. ప్రతి పైసా చంద్రబాబునాయుడుకు తిరిగివచ్చిందని తెలిపారు. బాబు అరెస్ట్‌పై తెలుగుదేశం పార్టీ వారు కూడా మాట్లాడేందుకు కూడా ముందుకు రావడం లేదని అన్నారు. చంద్రబాబుతో పాటు లోకేష్ కూడా అనేక ఆర్థిక నేరాలలో ఉన్నారని అన్నారు. బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి కూడా టీడీపీ కోవార్ట్ అని అన్నారు. జనసేన, టీడీపీ రెండు కలిసిపోయినా తమకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. దొంగలకు ఏరోజైన శిక్ష తప్పదని చంద్రబాబు నాయుడు పాపం పండిందని చంద్రబాబును ఆ దేవుడు కూడా కాపాడలేదని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆర్థిక సంక్షోభం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందని దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏఐపీఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో అఖిలభారత అభ్యుదయ వేదిక జిల్లా మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా అధ్యక్షులు నూనె జగన్మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భారతదేశ నేటి ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలసుబ్రమణ్యం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక అంశాలపట్ల ఒక్కటి కూడా నిజం మాట్లాడటం లేదని అన్నారు. మనదేశం బీజేపీ అధికారంలోకి రాకముందు 10వ స్థానంలో ఉంటే నేడు ఐదవ స్థానానికి ఎగబాకిందని తెలిపారు. దేశం ఆర్థికంగా ఎంతో ముందంజలో ఉందని ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ రంగంలోకి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ విధానాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వ పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు ఎంవి కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆశలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని అన్నారు. ప్రజలే రోడ్లమీదకు వచ్చి నిరసనలు తెలపాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి పీకే రాజేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎన్ బ్రహ్మానందం, నాయకులు పిచ్చయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, పోతినేని వెంకటేశ్వర్లు, సయ్యద్ సర్దార్, కరవది సుబ్బారావు, బీవీ సుబ్బారావు, డి రవి, పావులూరి సుబ్బారావు, పీవీఆర్ చౌదరి, ఎం మహాలక్ష్మి, జి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 16 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా ఆటలపోటీలు

విశాలాంధ్ర-ఒంగోలు : జెసిఐ వారోత్సవాలలో భాగంగా నాల్గొవ రోజు కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో చెస్ పోటీలు, ఈ పోటీలలో వివిధ విద్యాసంస్థలకు చెందిన సీనియర్, జూనియర్ విభాగాలలో దాదాపు 100 మంది విద్యార్థులు తపాల్గొన్నారు. అలాగే అంత్యాక్షరి, వెస్ట్రన్ డాన్స్ వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమాలలో భాగంగా ఐదవ రోజు కార్యక్రమాలను కూడా జయప్రదం చేయాలని వారోత్సవాల ఛైర్మన్ పి జనార్ధన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరి బ్రహ్మయ్య, నాయుడు మాల్యాద్రి, సోమినేని సురేష్; కసిబిసి నాగేశ్వరరావు, లిఖిత, పార్థసారధి, గణేష్,రాము, బాలకృష్ణ, శివకోటిరెడ్డి,శివ, బాష, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర-గిద్దలూరు : సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కర్నూలు అధ్వర్యంలో డి.ఇ.ఎ. ఫండ్ - రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా మరియు కెనరా బ్యాంకు సౌజన్యంతో ప్రకాశం జిల్లాలో 10 ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలను స్థాపించడమైనది. ఈ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ప్రాజెక్టుకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉంటారు. ప్రతి ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలలో ఇద్దరు కౌన్సిలర్స్ ఉంటారు. వారు వివిధ గ్రామాలలో సామాన్య ప్రజానికానికి బ్యాంకింగ్ పథకాలపై, సామాజిక భద్రతా పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్ పై, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలపై, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలపై, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్మన్ పై అవగాహన కల్పిస్తారు. అంతే కాకుండా బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్ విషయంలో, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన, జీవన్ జ్యోతి యోజన, ఈ- శ్రం కార్డ్, అభ కార్డ్ వంటి పథకాలను ప్రజలు పొందుటకై అప్లికేషన్ పూర్తి చేయడంలో బ్యాంక్ దగ్గరకు తీసుకెళ్లడంలో మా కౌన్సిలర్స్ సహాయ సహకారాలు చేస్తారు. మా కౌన్సిలర్స్ ఈ సేవలను పూర్తి ఉచితంగా చేస్తారు. ఎలాంటి ఫీజులు చెల్లించ వలసిన అవసరం లేదు. సున్నితమైన అంశాలైన బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఏటీఎం కార్డ్ నంబర్లు, ఆధార్ కార్డు నంబర్లు, పిన్ నంబర్లు, ఓటిపి నంబర్లు మా కౌన్సిలర్స్ అడగరు. మీ దగ్గర ఎలాంటి ఫింగర్ ప్రింట్స్ తీసుకోరు. ఆన్లైన్ బ్యాంకిగ్ మోసాలు జరిగినపుడు ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేస్తారు. డిజిటల్ పేమెంట్స్ డేమొన్స్ట్రేషన్‌ను మా కౌన్సిలర్స్ మొబైల్ నుండి చూపిస్తారు. కస్టమర్ మొబైల్ టచ్ చేయరు.మా ఆర్థిక అక్షరా స్యత కేంద్రాల కౌన్సిలర్స్ ఉచితంగా అందించే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక మోసాలకు గురి కావొద్దని, ప్రభుత్వ ఆర్థిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు తెలియజేశారు.

బాల - బాలికలకు అన్నదానం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జై భారత్ సర్వజన సేవా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు లోని బొమ్మరిల్లు అనాధ పిల్లల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం సేవా సమితి అధ్యక్షులు దార్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి ఆదరణకు నోచుకోని అనాధ పిల్లలను చేరదీసి బొమ్మరిల్లు అనాధ పిల్లల ఆశ్రమం ఏర్పాటు చేసి ఎంతో మంది అనాథ బాల - బాలికల జీవితాలను చక్కదిద్దుతున్న బొమ్మరిల్లు సంస్థ చైర్మన్ ఖాసింకి జై భారత్ సర్వజన సేవా సమితి తరుపున అభినందనలు తెలిపారు. రాబోవు కాలంలో అనాధలకు, అభాగ్యులకు, నిరుపేదలకు జై భారత్ సర్వజన సేవా సమితి ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామనీ సేవాసమితి సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పైనం మధుబాబు, పాలేటి కృష్ణబాబు, పోపూరి బంగారు బాబు, యనమదిని నాగేశ్వరరావు, సోడాబత్తిన కిరణ్ కుమార్, పేముల ప్రసాద్, గోగుల చెన్నయ్య, ఏ.అశోక్, కె జయ రాజ్, బొమ్మరిల్లు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జఫర్ డ్రోన్ ఫిక్స్‌డ్ వింగ్ రీ సర్వే

విశాలాంధ్ర-తర్లుపాడు : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆయా సచివాలయ పరిధిలో ఉన్నటు వంటి గ్రామ సర్వేయర్లతో, సంబంధిత అధికారులు కలిసి భూరీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. కానీ త్వరితగతిన భూరీ సర్వే చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జఫర్ డ్రోన్ ఫిక్స్ డ్ వింగ్ ద్వారా రీ సర్వే పూర్తి చేసేందుకు మండలంలోని చెన్నారెడ్డి పల్లి గ్రామ పంచాయితీలో మంగళవారం తహసిల్దార్ అబ్దుల్ హమీద్ పర్యవేక్షణలో పైలెట్ సతీష్, పర్వీజ్, అసిప్ లు ప్రవేశపెట్టడం జరిగినది. వీఆర్వో ఎన్, విజయ భాస్కర్‌రెడ్డి. సిద్దయ్య, సర్వేయర్ ఏరువ మస్తాన్ రెడ్డి, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

రైతు భరోసాకు ఆన్‌లైన్ చేసుకోవాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : 2023-24కు సంబంధించిన రైతు భరోసా పథకం ఈ మధ్యకాలంలో కొత్తగా పొలం ఎక్కించుకున్న వారు లేదా ఆన్లైన్ చేయించుకున్న వారు, ఇంతకు ముందు విడత రైతు భరోసా పడని వారు రైతు భరోసా పథకం కోసం అప్లై చేసుకోవడానికి లాగిన్ ఓపెన్ అవడం జరిగినదని, కావున రైతులందరూ దీనిని గమనించి మీ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వెంటనే అప్లై చేయించు కోవాలని ఏఓ కె బుజ్జిబాయి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసా చేసుకునేవారు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్, 1బి, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా కలిగివుండాలన్నారు.

దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర-కనిగిరి : దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు దోసపాటి నరసయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం గూగుల్ కంప్యూటర్ ఆవరణలో దివ్యాంగుల సంఘం సమావేశం జరిగింది. దివ్యాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు రూపొందించినప్పటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దివ్యాంగుల అభివృద్ధికి అన్ని రంగాల్లో వారికి చేయూత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మండల దివ్యాంగుల అధ్యక్షులు పాలూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఇంద్రకంటి దేవ సహాయం, సెక్రెటరీ ఇండ్ల వెంకట్ రమణయ్య, శ్రీధర సాయి కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర-పామూరు : ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఒంగోలు లోని బృందావనం కళ్యాణ మండపం లో జరిగింది. బాబు తో నేను - బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఇర్రి కోటిరెడ్డి, సయ్యద్ అమీర్ బాబు, గోళ్ళ వీరబాబు, గుత్తి మహేష్, మండ్ల రమణయ్య, యరగొర్ల రమేష్, శేషం మోషే తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు



విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడు లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గత విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేయడం జరిగింది. అందులో ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతులలో ప్రథమ స్థానంలో వచ్చిన విద్యార్థులకు 300 రూపాయలు చొప్పున, ద్వితీయ స్థానంలో వచ్చిన వారికి 200 రూపాయల చొప్పున మరియు పదవ తరగతిలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులకు వెయ్యి రూపాయలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు 500 రూపాయలు చొప్పున విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గోసు శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి చంద్రశేఖరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సుధాకర్ ల చేతుల మీదుగా విద్యార్థులకు మొత్తం5500 నగదు బహుమతులను అందజేయడం జరిగింది. పైవారు సంయుక్తంగా బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ వారికి విద్యార్థుల పట్ల చూపుతున్న దాతృత్వానికి, ప్రేమాభిమానాలకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవిఆర్ నేతాజీ రెడ్డి,ఎం రమణ, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన షేక్ అబ్దుల్ మజీద్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఒంగోలుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని మంగళవారం మర్యాదకపూర్వకంగా కలసిన మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి పూలమాలతో మర్యాద పూర్వకంగా కలిశాడు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల :
దోర్నాల్లోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనమును మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్ మంగళవారం ఆకస్మికంగ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీని, మధ్యాహ్న భోజనం రిజిష్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పులిహోరను ఉప్పు, పులుసు తగిన పాళ్ళలో వేసి మరింత రుచికరంగ తయారు చేయించాలని సూచించారు. బియ్యం, చిక్కీలు, కోడిగ్రుడ్ల స్టాక్‌ను పరిశీలించారు. ఫేషియల్ అటెండెన్స్ రిజిష్టర్, ట్యాబ్ రిజిష్టర్స్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్, మండల విద్యాశాఖాధికారి కొండలరావు ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు వి.నాగమూర్తి పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ముండ్లమూరు విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలను మంగళవారం ఎంఈఓ జే సుబ్బారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు పోటీలలో ఆసక్తిని పెంపొందించుకొని సోదర భావంతో ఆడాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎల్ మాధవిలత మాట్లాడుతూ క్రీడలు దేహదారుధ్యానికి ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఆటలలో బాగా రాణించినట్లయితే ఉద్యోగాలు సాధించవచ్చు అన్నారు. షార్ట్ పుట్ అండర్ 17 బాలుర విభాగంలో డి అంకం రావు(ఫస్ట్) మారెళ్ళ- జి విట్టర్ బాబు(సెకండ్) మారెళ్ళ- డి అజయ్ కుమార్ (థర్డ్) ఆదర్శ పాఠశాల ముండ్లమూరు షార్ట్ ఫుడ్ అండర్ బాలికలు కే అమృత వర్షిని(ఫస్ట్) ముండ్లమూరు- కే శ్రావణి (సెకండ్) ఉమామహేశ్వరపురం- జి.యోగేశ్వరి(థర్డ్) ఈదరు- వాలీబాల్ అండర్ 17 బాలురు సెలక్షన్ జీ వై ఎస్ బాబు వేముల,పి హరి దుర్గాప్రసాద్ వేముల, షేక్ బాషా మారెళ్ళ, ఎన్ జగదీష్ వేముల, విక్టర్ మారెళ్ళ, అంకమ్మరావు మారెళ్ళ, బిజ్జం శివారెడ్డి ముండ్లమూరు, ఎనుముల సాయి చరణ్ ముండ్లమూరు, ఎన్ హేమవర్ధన్ ఉమామహేశ్వరపురం, సిహెచ్ వెంకటశేష్ కుమార్ ఉమామహేశ్వరపురం, జి మోహన్ బ్రహ్మ ఆదర్శ పాఠశాల ముండ్లమూరు, కే మోహన్ ఆదర్శ పాఠశాల ముండ్లమూరు, అండర్ 17 బాలురు- తాతపూడి జెస్సిఫాల్ (ఫస్ట్) ముండ్లమూరు, మైలవరపు భాష సెకండ్ అండర్ 14 ఓ గులూరి గోపీచంద్ (ఫస్ట్) పూరి మెట్ల, తాతపూడి దినేష్ కుమార్(సెకండ్) ముండ్లమూరు విద్యార్థులు చత్తాచాటారు. పిఈటిలు మండల కోఆర్డినేటర్ జి భావన్నారాయణ, సుజాత, రాముడు, విజయ్ కుమార్, తులసి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బారావులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్

సువార్తమ్మను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విశాలాంధ్ర-కనిగిరి : పీసీపల్లి మండలం గుదేవారి పల్లి గ్రామానికి చెందిన గుడిపూడి సువార్తమ్మ, మరియమ్మ, నాగలక్ష్మిపై దాడి చేసిన కనిగిరి మండలం బొమ్మిరెడ్డిరపల్లి గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన నాని చెంచయ్య, వెంకట్రావు, నాలి తిరుపతమ్మ, నాలి వెంకట్రావుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సువార్తమ్మను ప్రజా సంఘాల నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆరితోటి మాలకొండయ్య ఆరె తోటి చిన్నమ్మికి చెందిన పది ఎకరాల అసైన్మెంట్ పొలం కలదు భూమిని సాగుచేసి విత్తనాలు వేయు సమయంలో దౌర్జన్యంగా దాడి చేసి కులంపేరుతో దూషించడం హేయమైన చర్య అన్నారు. దాడి జరిగిన విషయాన్ని పీసీపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కనిగిరి డిఎస్పి దృష్టికి తీసుకుని వెళ్లిన కేసు నమోదు విషయంలో స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి కేసును నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జిపి రామారావు, గుజ్జులా బాల్రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గోచిపాతల రవికుమార్ మాదిగ, అంబేద్కర్ ధర్మ పోరాట సమితి చదలవాడ బాల గురవయ్య, న్యాయవాది బాల నారాయణ, మాల మహానాడు నాయకులు కల్వకూరి శాంతరాజు, రావినూతల కొండయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవోకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఎంపీడీవో తాతపూడి సుకుమార్ మరోసారి ఎంపీడీవో గా వెలిగండ్లకి వచ్చిన సందర్భంగా సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు ఆయనకు స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి తిని పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఎంపీడీవో కార్యాలయం నందు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూన్న ఎంపీడీవోనీ ప్రజల మనసులో ఎప్పుడు నిండి ఉంటారని ఆయన అన్నారు. పలువురు ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ పులి రాజేష్‌కు అభినందనలు

విశాలాంధ్ర-కంభం : కంభం ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పులి రాజేష్‌ను ది కంభం ప్రెస్ క్లబ్ సబ్ డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అక్బర్ అలీ ఖాన్ ఆదేశాల మేరకు ఉపాధ్యక్షులు షేక్.రసూల్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఎస్ఐ పులి రాజేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ది ప్రెస్ క్లబ్ సబ్ డివిజన్ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

ఎస్ఐ పులి రాజేష్‌కు సన్మానం

విశాలాంధ్ర-కంభం : సాధారణ బదిలీలో భాగంగా కంభం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పులి. రాజేష్ ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల. అల్లూరయ్య పూల మాలతో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు కన్వీనర్ చెంచుల. సరస్వతి పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి పొంగళ్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని కాట్రగుంట గ్రామంలో వడిరాజుల కుటుంబీకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం పెద్దమ్మ తల్లికి పొంగళ్ళు సమర్పించారు. మహిళలు గ్రామస్తులు మంగళ వారం బోనాలతో వాయిద్యములతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు పెట్టారు. వర్షాలు కురిసి అందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తమభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఐ క్యాంపు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ప్రభుత్వ ఆదేశాల మేరకు యర్రగొండపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఎంఇఓ పి ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఐ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ గురుస్వామి హెరాల్డ్ సమారు 700 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి 47 మందికి కళ్లద్దాలు అవసరమని తెలిపారు. వారికి త్వరలో అద్దాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రమా దేవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, బాదరయ్య, పీసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్ర కోణాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి

- చంద్రబాబు, లోకేష్ పాదయాత్రల జనాదరణ ఓర్వలేకే చంద్రబాబు అరెస్టు
- కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి
- 2024 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- కార్యకర్తల మీద, నాయకులు మీద మరిన్ని నిర్బంధాలు పెరిగే అవకాశం
- ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో నేతలు

విశాలాంధ్ర -ఒంగోలు : రాజకీయ కుట్ర కోణంలోనే చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేశారని, చంద్రబాబు నాయుడు ఎటువంటి అవినీతికి పాల్పడలేదనే విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని, వైసిపి రాక్షస పాలనను ఎండగట్టాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలు టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో బుధవారం బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసానిబాలాజీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, కొండపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి, కనిగిరి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి, సంతనూతలపాడు ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే విజయకుమార్, మార్కాపురం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, కందుకూరు నియోజకవర్గం ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పరుచురు నియోజకవర్గం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఇంచార్జ్ కొండయ్య లు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న జనాదరణ, లోకేష్ బాబు పాదయాత్రకు వస్తున్న విశేషాదరణ చూసి ఓర్వలేక కుట్ల కోణంలో చంద్రబాబు నాయుడు పై కేసులు పెట్టి జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలలో టిడిపి అధికారంలోకి వస్తుందని వైసీపీ శ్రేణులు భయాందోళనకు గురవుతున్నారు అన్నారు. దీని నుంచి ఎలాగైనా తప్పించు కునేందుకు వరుసగా కేసులు పెట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బందులో పాల్గొన్న వారిపై 307, అటెంటు మర్డర్ కేసులు ప్రశ్నించారు. పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టాలన్నారు. నిరాహార దీక్షల వద్ద బోర్డును ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించాలన్నారు. అలాగే మండలానికి 10 మంది వంతున ప్రజాభిప్రాయాన్ని వీడియో తీసి పార్టీ ఆఫీసులకు పంపాలన్నారు. చంద్రబాబుపై జరుగుతున్న రాజకీయ కొత్తకోణాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హర్షిని విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం బృందావనం కల్యాణ మండపం నుండి త్రోవగుంట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తాగుకుంటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం కరపత్రాలను సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న విజయ వాడలో జరుగు అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు కళాక్షేత్రం నుండి ప్రదర్శన,అనంతరం జింఖానా గ్రౌండ్లో బహిరంగ సభ జరుగునని అయన అన్నారు. పాలకులు కళ్ళు తెరవండి, ఇచ్చిన మాట కట్టుబడి డిపాజిట్ దారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. దగాపడ్డ బాధితులు తమ సొమ్ము సాధించుకోవడం కోసం కదలిరవలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అగ్రిగోల్డ్ బాధితులు, ఏజంట్లు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుప నిచ్చారు. రామయ్య, సత్యనారాయణ, మల్లికార్జున పిచ్చయ్య పాల్గొన్నారు.

'నా మట్టి నా దేశం'

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని రామచంద్రకోట గ్రామంలో మంగళవారం నా మట్టి నా దేశం కార్యక్రమం దోర్నాల మండల బిజెపి అధ్యక్షుడు సూరవరం గడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పిరికెడు మట్టి, చిటికెడు బియ్యం సేకరణ, చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అమరవీరుల స్మారక చిహ్నాం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రోగ్రాం దేశవ్యాప్తంగా జరుగుతున్నది, అందులో భాగంగా దోర్నాల మండల అధ్యక్షులు సురవరం గండి వీరారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొచ్చు మల్లారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అంబటి అల్లూరి రెడ్డి, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు కాశీ నాయక్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు అల్లంపూర్ శ్రీను విజయవంతం చేశారు.

స్పీడ్ గన్‌తో తనిఖీలు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : జాతీయ రహదారి 544డిపై గొబ్బూరు వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో అతివేగంగా పోవు వాహనాలను స్పీడ్ గన్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో అమర్ నాయక్ మరియు ఎంవీఐ మాధవరావు మాట్లాడుతూ చాలా ప్రమా దాలు అతివేగముగా వాహనములు నడపడం వలన ప్రమా దాలు సంభవిస్తున్నాయని పరిమితికి మించి వేగంతో ప్రయాణించే వాహనాల వివరాలు స్పీడ్ గన్‌లో నమోదవుతాయని, తర్వాత అధిక వేగంతో ప్రయాణించిన వాహనం యొక్క జరిమానా వివరాలు వాహన యజ మానికి సంక్షిప్త సందేశం రూపంలో చేరుతా యన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్పీడ్ గన్ పరికరములతో ప్రభుత్వ వారు నిర్దేశించిన వాహనంల వేగ పరిమితుల్లోనే వాహనాన్ని నడపవలెనని పరిమితుల కంటే ఎక్కువ వేగంతో వాహనాన్ని నడిపిన ఎడల ప్రమాదాలు సంభవిం చుటకు అవకాశం ఎక్కువగా ఉన్నదని తెలిపినారు. ప్రమా దాలు నివారించుటకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపి ప్రమాదాలు నివారించాలన్నారు.

పొగాకు నారుమడి పరిశీలన

విశాలాంధ్ర-టంగుటూరు : మంగళవారం వావిలేటిపాడు గ్రామానికి పొగాకు నారుమడిని పరిశీలిం చడానికి పొగాకు బోర్డ్ ప్రొడక్షన్ మేనేజర్ మరియు ప్రాంతీయ అధికారి ఎం. కృష్ణశ్రీ మరియు ఎక్స్టెన్షన్ మేనేజర్ జి. దామోదర్ అలాగే టంగుటూరు పొగాకు బోర్డ్ వేల నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు మరియు సీనియర్ గ్రేడ్ ఆఫీసర్ సిద్ధ రాజు మరియు కొండేపి వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ విచ్చేసి పొగాకు నారుమడిని పరిశీలించినారు. నారుమడులు ఎప్పుడు సిద్ధం చేశారు, నారుమడిలో వేసిన విత్తనం రకము, విత్తనం మోతాదు, నారుమడికి వాడిన ఎరువులు, నారుమడికి అయ్యే ఖర్చులు గురించి అడిగి తెలుసుకున్నారు.

క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీపీ తులసమ్మ

విశాలాంధ్ర-కంభం : కంభం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడల పోటీలను మంగళవారం ఎంపీపీ చేగిరెడ్డి.తులసమ్మ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలనీ, క్రీడలలో గెలుపు కన్నా ముందు పాల్గొనడం ముఖ్యమని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ స్వయంగా ఆటల్లో పాల్గొని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు మండల విద్యాశాఖ అధికారి బి.మాల్యాద్రి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడతాయనీ, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. స్పోర్ట్స్ కోఆర్డినటర్ మరియు పీడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ మండల స్థాయి క్రీడల పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశామనీ, మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ మరియు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, సి.ఆర్పీ మురళి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ఎస్.సుబ్రమణ్యం మండలంలోని అన్ని పాఠశాలల పీడీలు, పిఈటీలు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లులు తగ్గించాలి

గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు భవనాసి వెంకట రామాంజనేయులు

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్య తరగతి ప్రజల నుండి కరెంట్ చార్జీ లను అదనపు చార్జెస్ అని సర్ చార్జెస్ అని వివిధ రకాలుగా అదనపు చార్జెస్ వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తుందని వీటిని తగ్గించాలని భారతీయ జనతా పార్టీ తరుపున గిద్దలూరు కరెంట్ ఆఫీస్ నందు మార్కాపురం డివిజన్ ఈఈకి మంగళవారం వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈఈ స్పందిస్తూ ప్రభుత్వానికి సమస్యను తెలియచేస్తామని చెప్పారు. అంతే కాకుండా కరెంట్ కోతలు అధికంగా విధిస్తూ ప్రజల ఇబ్బందులను పట్టించుకోవాలని కరెంట్ కోతలు విధించే సమయాలను ప్రజలకు తెలియచేయాలని, కరెంట్ కోతలు లేకుండా చూడాలని పట్టణ బీజేపీ అధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు అధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇందులో పట్టణ బీజేపీ జనరల్ సెక్రెటరీ ముప్పు రీ శ్రీనివాసులు, నియోజకవర్గ అన్న యోజన ఇంఛార్జి కమలా పాటి చంద్ర మోహన్, జిల్లా ఓబిసి కోశాధికారి కాసులు పాల్గొనడం జరిగింది.

పేద ప్రజల దాహార్తిని తీర్చిన సీపీఐ - తాగునీరు లేక ఇబ్బందులు

15 కుటుంబాలకు విముక్తి

విశాలాంధ్ర-పీసీపల్లి : పిసిపల్లి మండలంలోని గుదేవారిపాలెం పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో నివాసముంటున్న బీసీ కులానికి చెందిన పాములు పట్టేవాళ్ళు గత కొంతకాలంగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సమితి సభ్యులు జిపి రామారావు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ తాగునీరు లేక వాళ్ళు ఎదుర్కొంటున్న కష్టాలను స్వయంగా చూసి రామాపురం సిపిఐ శాఖ ఆధ్వర్యంలో సమీపంలో ఉన్న మంచినీటి బావికి మోటారును ఏర్పాటు చేసి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న బీసీ కులానికి చెందిన 15 పాములు పట్టే కుటుం బాలకు మంచినీటి కులాయిని ఏర్పాటు చేశారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతూ గొంతెండుతున్న తమ సమస్యకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పరిష్కారం చూపడంతో ఆ కుటుం బీకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో పోలా రత్తయ్య పోలా బాబు నాగులూరి పోలేరు శ్రీను నరసింహులు బ్రహ్మయ్య రాము మేరి అబ్రహాము పాల్గొన్నారు.

సక్రమంగా రాని రామతీర్థం జలాలు

ఇదిలా ఉండగా తమకు రామతీర్థం జలాలు సక్రమంగా రావటం లేదని వారు ఆరోపిస్తున్నారు. రామతీర్థం జలాలు సక్రమంగా రాకపోవడం వలన మాకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

'నాడు -నేడు' పనుల పరిశీలన

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్+2కళాశాలలో నాడు నేడు పనులను మంగళవారం కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ ఇరగని చలపతిరావు, కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరెస్పాండంట్ కదిరి పార్థసారధి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో జరుగుతున్న బాత్ రూమ్స్, పహారి గోడ, వంట గది, తదితరపనులను పరిశీలించారు. అదేవిధంగా అదనపు తరగతి గదులు కూడా త్వరలోనే మంజూరు చేయించి పనులు మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రకాష్, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో రైతులకు మేలు

విశాలాంధ్ర-తాళ్లూరు : మిశ్రమ పంటల సాగు, ప్రధాన పంటలో మిశ్రమ పంటలుగా చిరుధాన్యాల సాగు రైతులకు మేలు కలిగిస్తుందని మండల వ్యవసాయాధికారి బి ప్రసాద రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో పర్యటించి అంతర్ పంటలుగా చిరుధాన్యాల సాగు చేసే రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిశ్రమ ఆహార పంటల సాగు ద్వారా భూమిలో జీవవైవిధ్యం పెంపొందుతుందని దీనివల్ల భూమి సారవంతం అవ్వడమే కాక ఆహార ఉత్పత్తి జరిగి చిన్న ,సన్న కారు రైతులకు లాభాన్ని చేకూరుస్తుందని ఆయన అన్నారు. ప్రధాన పంటలో అంతర్ పంటలుగా రాగులు, సజ్జలు, జొన్నలు, తదితర పంటలతో పాటు పప్పు ధాన్యాలైన కంది, పెసర, అలసంద, తదితర పప్పు ధాన్యాలను పండించడం వల్ల నత్రజని ఎక్కువగా తీసుకొని ప్రధాన పంటకు మేలు కలిగిస్తుందని ఆయన అన్నారు. అందువల్ల రైతులు అంతర్ పంటలుగా చిరుధాన్యాల వైపు దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, గ్రామ వ్యవ సాయ సహాయకులు అజ్మీర్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : జగనన్న పాలవెల్లువ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్డీఏ ఐకెపి ఏపీఎం నూనె.వెంకటయ్య అన్నారు. మండలంలోని మర్రివేముల గ్రామంలోని సచివాలయంలో మంగళవారం జగనన్న పాలవెల్లువపై అవగాహనా కార్యక్రమం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘాలతో పాల సొసైటీని ఏర్పాటుచేసుకోవాలన్నారు. పాల సొసైటీలలో సభ్యులుగా చేరాయాలన్నారు. జగనన్న పాలవెల్లువ లో చేరివారికి రుణాలు మంజూరు చేయడం జరుగుతుం దన్నారు. పాలు పోసేందుకు ఎర్రగొండపాలెం సొసైటీ బ్యాంక్ నుండి గేదెలకు రుణాలు ఇస్తారని అన్నారు.

నేడు వీకెఎంయూ మండల మహాసభ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వికెఎంయూ ఒంగోలు మహాసభ నేడు కరవది గ్రామంలో జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గద్దల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు కరవదిలోని జీవరత్నం స్మారక స్థూపం సమీపంలో మహాసభ ప్రారంభం అవుతుందని, ఈ మహాసభను ఎస్‌డి మౌలాలి, ప్రారంభిస్తారని, ప్రధాన ఉపన్యాసకులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు పాల్గొంటారని తెలిపారు. వీరితో పాటు హనుమారెడ్డి, లక్ష్మారెడ్డిలు హాజరవుతారని మహాసభకు వ్యవసాయ సంఘం కార్యకర్తలు, కూలీలు పాల్గొని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన జూపూడి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్‌ను కలెక్టరేట్లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ము అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ, వై.ఎస్. ఆర్.సి.పి. బి.పి. జోనల్ ఇన్చార్జి బొట్ల రామారావు, వై.ఎస్.ఆర్.సి.పి. జిల్లా ఎస్.సి. సెల్ అధ్యక్షులు దురా ప్రసాద్, కొండపి వై.ఎస్.ఆర్.సి.పి. సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్లు, బాలకోటిరెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం బంతిపూల సాగు

తెగుళ్ల బెడద లేని బంతిపూల సాగు

విశాలాంధ్ర-కొమరోలు : ప్రణాళిక ప్రకారం బంతి పూల సాగు చేపట్టి లాభాల పట్టారు. కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భూలక్ష్మమ్మ అనే రైతు. శు భకార్యాల సీజన్‌కు దిగుబడి వచ్చేలా వేసవి సమయంలో సాగుకు శ్రీకారం చుట్టి అనుకున్న ఫలితాలు సాధించారు.

జాగ్రత్తలు ఇలా : ఏప్రిల్ నెలలో రూ.20 వేలు వెచ్చించి పసుపు, ఎరుపు రకం బంతి విత్తనాలను మదనపల్లిలో సేకరించి ఓ నర్సరీలో నారు పోశారు. పాతిక రోజులకు నారు సిద్ధమైంది. అప్ప టికే దుక్కి దున్ని, బోదెలతో సిద్ధం చేసిన రెండెకరాల పొలంలో మొక్కలు నాటించారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో మొక్కలకు తడులకు ఇబ్బంది లేకుండా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశారు. ప్రతి పదిహేను రోజులకు ఓసారి ఎకరాకు రెండు బస్తాలు చొప్పున కాంప్లెక్స్ ఎరువులు అందించారు. కలుపు సమస్య లేకుండా ఎప్పటికప్పుడు. అంతర సేద్యం చేయించారు. యాభై రోజులకు పువ్వులు కోతకు వచ్చాయి. బంతి తోటలకు తెగుళ్ల సమస్య పెద్దగా ఉండదని రైతు తెలిపారు.

మంచి ఆదాయం : విత్తనాలు, ఎరువులు, సేద్యం ఖర్చులు ఎకరాకు రూ. 60 వేలు చొప్పున.. రెండే కరాలకు మొత్తంగా రూ.1.20. లక్షల పెట్టుబడి పెట్టారు. కోసిన పూలను మార్కాపురం, గిద్దలూరు, కంభం, గుంటూరు, కొమరోలు తదితర ప్రాంత మార్కెట్లకు తరలించారు. ఇప్పటి వరకు సుమారు 10 కోతలు కోసినట్లు రైతు తెలిపారు. మొత్తంగా పది టన్నుల మేర దిగుబడి వచ్చిందని చెప్పారు. సగటున కిలోకు రూ. 50 వరకు వచ్చిందని... కోత కూలీ. రవాణా తదితర ఖర్చులు పోనూ టన్నుకు దాదాపు రూ.40 వేల మేర మిగులు కనిపించినట్లు వివరించారు. ఎండల తీవ్రత ఎక్కు వగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో వీటి సాగు తక్కువగా ఉంటుందని ఆ సమయంలో నాటితే దిగుబడి వచ్చే సమయానికి మంచి ధర లభించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం తోట చివరి దశకు వచ్చిందని మరో రెండు మూడు కోతలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి రక్షణ కలిగించే విధంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ కే ఖాదర్ మస్తాన్ బి అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు మంగళ వారం ఆశ వాలంటీర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో జగనన్న సురక్ష కార్య క్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ కే ఖాదర్ మస్తాన్ బి, మరో వైద్యులు డాక్టర్ రాజేష్ యాదవ్ లు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి జగనన్న సురక్ష కార్య క్రమానికి శ్రీకారం చుట్టడం జరుగు తుందని తెలిపారు. ఈనెల 16వ తేదీన ఆశ వాలంటీర్లకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్ హెచ్ పిఎస్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తదుపరి వైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాలలో టీములుగా ఏర్పడి జగనన్న సురక్ష యాప్‌ను డౌన్లోడ్ చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కలిగిస్తూ, ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబి రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు అన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన మాధవరంలో, అక్టోబర్ 3న మల్కా పురంలో, అక్టోబర్ 4న శివరామ పురంలో, అక్టోబర్ 5న విఠలాపురంలో, అక్టోబర్ 7న మన్నేపల్లి, దారంవారిపాలెం గ్రామాలలో, అక్టోబర్ 9న తురకపాలెం గ్రామంలో, అక్టోబర్ 16న తాళ్లూరు కు చెందిన రెండు ప్రముఖ కేంద్రాలలో శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ,రక్త పరీక్షలు వాటిని నిర్వహించి వైద్యాధి కారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎంలు, యంఎల్ హెచ్‌పిఎస్‌లు పాల్గొన్నారు.